## క్లుప్తంగా

### కాల్వల్లో వ్యర్థాలను వేయవద్దు



తెనాలిఅర్బన్: మురుగు కాల్వల్లో వ్యర్థాలను వేయవద్దని, వాటివల్ల కాల్వల పారుదల నిలిచిపోతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 14వ వార్డులో మంగళవారం ఉదయం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే జేసీబీతో మురుగు కాల్వల పూడికతీత పనులు చేయించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, పలువురు మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

### పెదరావూరులో దంత వైద్య శిబిరం



తెనాలిరూరల్: తక్కెళ్లపాడులోని సిబార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ఆధ్వర్యంలో తెనాలి మండలం పెదరావూరులోని శ్రీలక్ష్మి కల్యాణ మండపంలో ఉచిత దంత వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన కొడాలి రమణకుమార్, మారౌతు సీతారామయ్యల సహకారంతో వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో సుమారు 200 మందికి దంత పరీక్షలు చేసి వైద్య సలహాలు అందించారు. డాక్టర్ కడియాల కృష్ణకిషోర్, డాక్టర్ రావూరి శ్రీనివాస్, డాక్టర్ వినీల, డాక్టర్ ఫణీంద్ర, దంత కళాశాల సిబ్బంది వైద్య సేవలు అందించారు.

### రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ



తెనాలిఅర్బన్: పేదల సొంత ఇంటి కలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని 24వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పెదలంక లక్ష్మీ లావణ్య పేర్కొన్నారు. 24వ వార్డు పరిధిలోని లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను సోమవారం రాత్రి సచివాలయం వద్ద పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెదలంక వెంకటేశ్వర రావు, సీమోను, సురేష్, జానీ, కిరణ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### గీతాంజలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



తెనాలిఅర్బన్: టీడీపీ, జనసేన సోషల్ మీడియా వేధింపులకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న తెనాలివాసి గొల్తి గీతాంజలి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ మంగళవారం వారి నివాసంలో కలసి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులందరూ అండగా ఉంటారని ధైర్యం చెప్పారు. అనంతరం రూ.లక్ష నగదును గీతాంజలి కుమార్తెలకు ఆమె అందజేశారు. కార్యక్రమంలో పలువురు మహిళా విభాగం నాయకులు ఉన్నారు.

### పారిశుద్ధ్య కార్మికులకు అన్నదానం



తెనాలిటౌన్: పట్టణ నందులపేట నరేంద్రదేవ్ కాలనీలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులను అన్నదానం చేశారు. కొపల్లిపరకు చెందిన గుదిబండి పద్మ జ్ఞాపకార్థం భర్త గుదిబండి సుధాకరరెడ్డి సేవ కార్యక్రమం నిర్వహించారు. సత్యం, శివం, సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో కార్మికులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సుధాకరరెడ్డి, గాజుల మోహన్, పాశం పండరీనాథ్, గుదిబండి శ్రీనివాసరెడ్డి, తోట సాంబశివరావు, భవానీ, ప్రసన్న, గీత, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీతోనే రాజకీయాల్లో జవాబుదారితనం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పట్టణ అధ్యక్షులు శేషాచలం, దుబాయ్ బాబు

తెనాలిఅర్బన్: రాజకీయాలో జవాబుదారితనాన్ని తీసువచ్చిన ఏకైక రాజకీయ పార్టీ వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం గంగానమ్మపేటలోని పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన జెండాను పార్టీ పట్టణ క్లస్టర్-1,2 అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబులు ఏగురవేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ నవరత్న పథకాలను మ్యానిఫెస్టోలో రూపొందించి అధికారంలోకి వచ్చిన వెంటనే తమ ప్రభుత్వం వాటిని అమలు చేయటం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-1,2 అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్ బాబులు మాట్లాడుతూ త్వరలో జరనున్న ఎన్నికలకు పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. 2024లో కూడ తమ ప్రభుత్వం అత్యధిక మెజార్టీతో గెలిచి అధికారంలోకి వస్తుందనే ధీమాను వ్యక్తం చేశారు. ఒంటరిగా పోటీ చేయలేని టీడీపీ, జనసేన, బీజేపీలు పొత్తులతో ప్రజలను మోసం చేసేందుకు ముందుకు వస్తున్నాయని, వారి మోసాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, ఎంపీపీ చెన్నయ్య, వివిద కార్పొరేషన్ డైరెక్టర్‌లు రాళ్లబండి సుష్మ, కావేటి నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు బూరెల దుర్గ, దేసు శ్రీనివాసరావు, బండ్లమూడి భాస్కర రావు, కాకి దేవసహాయం, కఠారి హరీష్, యలవర్తి సాంబశివరావు, కుక్కల ముక్తేశ్వరరావు, ఉడుముల మహేష్, చుండూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కఠెవరంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

**కఠెవరంలో...**

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను మంగళవారం జరిపారు. మర్లమ్మగుడి సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మైలా భాను ప్రసాద్, ఆదం షఫీ, ఎల్.చినబాబు, శివారెడ్డి, శివన్నారాయణ, శివరామయ్య, సురేష్, శ్రీనివాస రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మనసున్న మారాజు జగన్‌మోహన్‌రెడ్డి

- ఇళ్లస్థలాల పట్టాలను రిజిస్ట్రేషను చేసి సర్వసంపూర్ణ హక్కులతో అందజేస్తున్నాం
- మరే ప్రభుత్వం, మరే సీఎం కూడా ఇంత గొప్పగా ఆదుకోలేరు
- రూరల్ మండల పరిధిలో ఇళ్లస్థలాల రిజిస్ట్రేషను పత్రాల పంపిణీ సభలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



రిజిస్ట్రేషను పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలపై ప్రేమ కలిగిన మనసున్న మారాజు కనుకనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం, ఇళ్లస్థలాలను అందించారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మరే ముఖ్యమంత్రి, మరే ప్రభుత్వం కూడా ఇంత గొప్పగా ఆ వర్గాలను ఆదుకోలేరని స్పష్టంగా చెప్పారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద రూరల్ మండలంలో నాలుగు వేలమంది మహిళలకు, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే శివకుమార్ పంపిణీ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటైన సభలో మాట్లాడుతూ గతంలో ఏదైనా ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఇచ్చిందంటే, కేవలం డీకే పట్టాను ఇచ్చి ఊరుకునే వారని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలను కల్పించి రిజిస్ట్రేషను చేసి మరీ సర్వసంపూర్ణ హక్కులతో రిజిస్ట్రేషను పత్రాలను ఇస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రేషను ఖర్చులను సైతం ప్రభుత్వమే భరించిందన్నారు.

గత ప్రభుత్వాల్లో ఏ ఎమ్మెల్యే కూడా 1000-1500 మించి ఇళ్లస్థలాలను ఇవ్వలేదన్నారు. ఆ దేవుడు జగన్‌మోహన్ రెడ్డి రూపంలో తనచేత 27 వేల మందికి ఇళ్లస్థలాలను ఇచ్చే అవకాశం కల్పించారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లస్థలం విలువ రూ.4-5 లక్షలుగా చెప్పారు. ఇంటి నిర్మాణానికి రూ.లక్షా 80 వేలను అందజేస్తున్నామని, అదికూడా చాలకపోతే డ్వాక్రా గ్రూపుల్లో రుణాలు తీసుకుని, గ్రామాల్లో బ్రహ్మాండంగా ఇళ్లను నిర్మించుకుంటున్నారని వివరించారు. నియోజకవర్గంలో మరో 13 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నామని, ఇప్పుడు నాలుగో విడత సాయం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. చేయూత కింద రూరల్ మండలంలో రూ.25 కోట్లు, నియోజకవర్గంలో రూ.80 కోట్ల ఆర్థికసాయం ఇచ్చామన్నారు. మొత్తం 37 వేలమందికి ప్రతినెలా రూ.10.86 కోట్ల వలంటీర్లే ఇంటికి వెళ్లి ఇస్తున్నారని గుర్తుచేశారు. వైఎస్సార్ ఆసరా కింద 30 వేల డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేశామన్నారు. ఎవరు ఏ పార్టీకి ఓటు వేసినా, అర్హులైన అందరికీ రూ.1800 కోట్ల సంక్షేమం అందించిన ఘనత తమదేనని ఎమ్మెల్యే శివకుమార్ వెల్లడించారు. ప్రజలకు ఇంతగా మంచి చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మీరంతా రెండోసారి ముఖ్యమంత్రిని చేసి తీరతారని భావిస్తున్నానని అన్నారు. రాగద్వేషాలు లేకుండా అర్హులైన అందరికీ సంక్షేమం ఇచ్చిన తనకు మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. కరోనా రోజుల్లో ప్రజల మధ్య తిరుగుతూ బాధితులకు సకాలంలో వైద్యం, నిత్యావసరాలు అందేలా చూసుకుంటూ గడిపానని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్నికల్లో పోటీ అంటూ వచ్చిన వాళ్లు కరోనా రోజుల్లో ఎక్కడ దాక్కున్నారని ఎమ్మెల్యే శివకుమార్ ప్రశ్నించారు.

లోకల్ వ్యక్తిగా ఇక్కడే ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వస్తున్న తనను, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే వేదికపై నాలుగో విడత చేయూత పథకం కింద మహిళలకు రూ.7 కోట్ల 79 లక్షల చెక్కును ఆయన అందజేశారు. తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గీతాంజలికి ఎమ్మెల్యే శ్రద్ధాంజలి

- ట్రోల్ చేసిన వారు వెధవలు
- అంతకుమించి ఏమనాలో తెలియటం లేదు
- వేలాది మహిళలతో సహా గీతాంజలికి శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యే శివకుమార్



గీతాంజలి మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, లబ్ధిదారులు

తెనాలి: ప్రభుత్వం ద్వారా పొందిన ఇంటి స్థలానికి రిజిస్ట్రేషను పత్రాన్ని అందుకున్న సంతోషంలో యూట్యూబ్ చానల్‌లో పంచుకున్న మహిళను నీచాతి నీచంగా ట్రోల్‌చేసిన వెధవలను అంతకు మించి ఏమనాలో అర్థం కావటం లేదని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. టీడీపీ, జనసేన సోషల్ మీడియా ట్రోలింగ్‌తో తీవ్ర మనస్తాపానికి లోనై ఆత్మహత్యకు పాల్పడిన బీసీ మహిళ గొల్తి గీతాంజలి గురించి మంగళవారం తెనాలి రూరల్ మండలంలోని మహిళలకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషను పత్రాల పంపిణీ సభలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గీతాంజలి ఫొటోను చూపుతూ ప్రభుత్వం ద్వారా సంక్షేమాన్ని పొందిన లబ్ధిదారు సంతోషాన్ని ఓర్చుకోలేని ప్రతిపక్షాలు ఈ రోజున మనదగ్గర ఉన్నాయని విమర్శించారు. అద్దె ఇంట్లో ఉంటున్న తనకు సొంత స్థలం వచ్చి తన కల నెరవేరిందన్న ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ ఇతరపథకాలపై అడిగిన ప్రశ్నకు నాలుగుసార్లుకు బదులుగా అయిదుసార్లు అమ్మఒడి తీసుకున్నానని అనటమే నేరమైందని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రిని, తనను పొగడటంతో ఓర్చుకోలేని టీడీపీ, జనసేన సోషల్‌మీడియా కార్యకర్తలు గీతాంజలి వేషభాషలతో సహా వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారనీ, ఆమె ఆత్మహత్యకు పాల్పడేలా చేశారని తీవ్రంగా అన్నారు. గీతాంజలి బలవన్మరణంపై సంతాపం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే సూచనపై గీతాంజలి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ అక్కడున్న వేలాదిమంది మహిళలు లేచి నిలుచుని కొద్దిసేపు మౌనం పాటించారు.

# మండల పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా భానుప్రసాద్



నూతన ప్రెసిడెంట్ భానుప్రసాద్‌ను సత్కరిస్తున్న పాస్టర్‌లు

తెనాలిటౌన్: తెనాలి మండల పాస్టర్స్ అసోసియేసన్ ప్రెసిడెంట్‌గా రెవరెండ్ ఎ.భానుప్రసాద్ ఎన్నికయ్యారు. రూరల్ మండలం నందివెలుగులోని ఇమ్మానుయేలు ప్రార్థనా మందిరం చర్చిలో మంగళవారం తెనాలి మండల పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నికల జరిపారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా రెవరెండ్ ఎ.భానుప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా రెవరెండ్ డి.రమేష్, సెక్రటరీగా రెవరెండ్ సి.హెచ్. రాకడపీటర్ పాల్ జాయింట్ సెక్రటరీగా రెవరెండ్ అజిత్‌కుమార్, కోశాధికారి పాస్టర్ ఎం.బర్నబాసు, సబ్‌కోశాధికారిగా సిస్టర్ మేరి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పాస్టర్ టి.యోబు, రెవరెండ్ సువర్ణబాబు, పాస్టర్ కె.లూకా, రెవరెండ్ కె.ఏసుబాబులను ఎన్నుకున్నారు. ఈరే మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ కె.సుధీర్‌కుమార్ అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు.

**అసోసియేషన్‌కు లక్ష రూపాయలు విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే శివకుమార్**

అనంతరం మందిరంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. నూతన ప్రెసిడెంట్ భానుప్రసాద్‌ను శాలువాలు, బొకెలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి రూ.లక్షల విరాళం అందజేస్తామని ప్రకటించారు. దేవునికి, ప్రజలకు అనుసంధానంగా పాస్టర్స్ ఉన్నారని, పాస్టర్స్ ఆరాధన, ప్రార్థనలను ప్రభువు ఆలకిస్తారని తెలిపారు. ప్రార్థనల ద్వారా ఆశీర్వదించాలని కోరారు. అసోసియేషన్ ద్వారా ప్రజలకు సేవ చేయాలని, కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రెసిడెంట్ భానుప్రసాద్ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా పాస్టర్‌ల కుటుంబాలకు, పాస్టర్‌లను నవరత్నాల పథకాల అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతినెలా మొదటి మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయాలను చర్చిస్తామని చెప్పారు. సమావేశంలో పలువురు పాస్టర్‌లు, దైవజనులు పాల్గొన్నారు.

# నేడు కొలకలూరు అమరవీరులకు వందనం



కరపత్రాలను విడుదల చేస్తున్న లక్ష్మయ్య, ఆశోక్‌కుమార్

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో గరువుపల్లిలో బుధవారం సాయంత్రం అమరవీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సామిజికవేత్త ఉన్నం లక్ష్మయ్య తెలిపారు. పల్లెవీరులైన మంచికపూడి సుబ్బారావు, మునపల్లి క్రిస్టోఫర్‌లను స్మరించుకుంటూ తొలితరం పోరాటయోధులకు జోహార్లు అర్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన వక్తలైన మాజీమంత్రి మాణిక్య వరప్రసాద్, ఏపీ కాలేజ్ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి.ముత్యం, ఎన్‌యు ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ స్వరూపరాణి, విశ్రాంత జాయింట్ కలెక్టర్ జి.నీలకంఠం, ఎఎన్‌యు ప్రొఫెసర్ డాక్టర్‌పి.రత్నాకర్, తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని సంబంధించిన కరపత్రాలను నిర్వాహకులు మంగళవారం విడుదల చేశారు. సామాజికవేత్త లక్ష్మయ్య, ఆశోక్‌కుమార్, వినయ్‌కుమార్, మాణిక్యరావు, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖలో విప్లవాత్మక మార్పులు

**ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్**



డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: వైద్య ఆరోగ్యశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. ఐతానగర్ నేలపాడు రోడ్డులో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్‌హెల్త్ సెంటర్ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖను ప్రభుత్వం బలోపేతం చేసిందన్నారు. పేద ప్రజలకు ఆయా ప్రాంతాల్లోనే వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవి నేడు ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తున్నాయని కొనియాడారు. తెనాలి పట్టణంలో అతిపెద్ద జిల్లా వైద్యశాల, తల్లిపిల్లల వైద్యశాలలు ఉన్న పట్టణంలోని వార్డుల్లో ఐదు వైఎస్సార్ అర్బన్‌హెల్త్ సెంటర్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయా వార్డులోని ప్రజలకు అక్కడే వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. వాటి కోసం రూ.5 కోట్లకు పైగా నిదులు వెచ్చించినట్లు వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. ప్రజల వద్ద కార్పొరేట్ వైద్యాన్ని తీసుకు వచ్చి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్లు గెద్దేటి సురేంద్ర, గెద్దేటి ఝాన్సీవాణి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల్లో మరింత చైతన్యం రావాలి

**ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు**



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

తెనాలిఅర్బన్: మహిళల్లో మరింత చైతన్యం రావాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తెనాలిలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయలలో మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా స్త్రీలు కూడా అన్ని రంగాల్లో ప్రవేశించడం అభినందనీయమన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ అధ్యక్షురాలు పి.సౌజన్య, నాయకులు ఎఎస్.కుసుమకుమారి, బి.ఆదిలక్ష్మి, గయాసుదౌలా, బాబుప్రసాద్, కామాక్షి, సాంబశివరావు, కేదార్‌నాథ్, బసవేశ్వరరావు, అహ్మద్‌హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

### ఒలంపియాడ్‌లో పలువురికి ర్యాంకులు



సర్టిఫికెట్‌లు అందుకున్న విద్యార్థులతో ఎండీ మురళీకాంత్

తెనాలిఅర్బన్: న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు నిర్వహించిన జాతీయ గణిత ఒలంపియాడ్ పరీక్షలలో బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్ విద్యార్థులు ఆరుగురు మంచి ర్యాంకులు సాధించారని స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ తెలిపారు. పోటీలను డిశంబర్‌లో నిర్వహించినట్లు చెప్పారు. మంగళవారం స్కూల్ ఆవరణలో విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సైన్స్ ఎగ్జిబిషన్‌లతో ఎంతో ఉపయోగం



నమూనాతో ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

తెనాలిఅర్బన్: విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు దోహదపడతాయని విజయవాణి స్కూల్ డైరెక్టర్ బండికళ్ల ప్రసాద్, షారోన్ టాలెంట్ స్కూల్ డైరెక్టర్ కె.శ్యామ్ బెనర్జీలు పేర్కొన్నారు. మారీసుపేట రెండుగేట్ల మధ్యలోని సెయింట్ పాల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో మంగళవారం సైన్స్, ఆర్ట్స్, కల్చరల్ ఎక్స్‌పోను నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను అక్కడ ప్రదర్శించి వాటి వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపకులు ఎండీ చావలి, డైరెక్టర్‌లు అకుల్‌నాధ్, చావలి తేజోనాథ్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మేలు

రేపల్లె రూరల్: విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోపడతాయని రామకృష్ణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అపర్ణ అన్నారు. పట్టణంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూలులో మంగళవారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. చదివిన దానికంటే చూసి నేర్చుకున్న అంశాలే ఎక్కువగా గుర్తుంటాయని, అటువంటి పాఠ్యాంశాలను విజ్ఞాన ప్రదర్శనలో చూసి నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కుర్రా మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ వైఎస్సార్ సీపీ ప్రచారం



అట్లు వేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

తెనాలిఅర్బన్: త్వరలో జగరనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప కోరారు. 26వ వార్డులో మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి వైఎస్సార్‌సీపీకి వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, కౌన్సిలర్ షేక్ ఇస్మాయేల్, ఇస్రాత్, జాకీరా, పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

### జిల్లా గ్రంథాలయానికి కుర్చీలు, టేబుల్స్, ఫ్యాన్‌లు బహూకరణ



కుర్చీలు, టేబుల్స్ ఫ్యాన్‌లతో సంస్థ ప్రతినిధులు

తెనాలిఅర్బన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయానికి అవసరమైన 21 చైర్స్, 2 టేబుల్స్, 20 ప్యాడ్స్, 4 ఫ్యాన్‌లను మంగళవారం ఉచితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ రీజనల్ చైర్మన్ కొత్త సుబ్రమణ్యం మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో గ్రంథాలయానికి అవసరమైన మరిన్ని వసతులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ డాక్టర్ కె.రామచంద్, కో-చైర్మన్ డాక్టర్ శారద, పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

### షిరిడీ సాయి మందిరం నాలుగో వార్షికోత్సవం

తెనాలిటౌన్: పట్టణ బి.సి.కాలనీలో షిరిడీ సాయి మందిరం నాలుగో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. మందిరంలో ఉదయం స్వామివారికి విశేష పూజలు జరిపారు. అభిషేకాలు నిర్వహించారు. షిరిడీలో జరిగే విధంగా మందిరంలో ప్రతిరోజు పూజలు, అభిషేకాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కె.లక్ష్మణ్ తెలిపారు. భక్తి గీతాలను వెంపటి సత్యనారాయణ ఆలపించారు. మందిరం ప్రధాన అర్చకులు జంధ్యాల రాజేశ్వరరావు పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను, అన్నప్రసాద వితరణ చేశారు.